క్లుప్తంగా

నాటక ప్రదర్శన ప్రారంభం

మిర్యాలగూడ : దామరచర్లలో ముత్యాలమ్మ జాతర సందర్భంగా 'సింహా- నరసింహ, పులి- వేట' అనే సాంఘిక నాటిక ప్రదర్శనను శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ ప్రారంభించారు. ఈ నాటిక ముత్యాలమ్మత తల్లి కళామండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరకోటి రెడ్డి, పెదకోటిరెడ్డి, సోము సైదిరెడ్డి, బాలలక్ష్మీ సత్యనారాయణ, నాగుల్‌మీరా, వీరబాబు, సోమయ్య, సోమయ్య, నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బ్రదర్స్, రఫీ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహించొద్దు

పెద్దవూర: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రేపాకుల ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ నేతలు పామనగండ్ల లాలుగౌడ్, వెంకటాచారి, నాగరాజు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి చేయూత



మతిస్థిమితం లేని వ్యక్తిని పోలీస్ స్టేషన్‌లో అప్పగిస్తున్న యువకులు

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు గ్రామంలో మూడు నెలలుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతూ బస్టాండ్‌లో తలదాచుకుంటున్న వ్యక్తిని గ్రామ యువత సహకారంతో శుక్రవారం పోలీసులు స్వచ్ఛంద సేవా సంస్థకు అప్పగించారు. ఉత్తర ప్రదేశ్ చెందిన వ్యక్తిగా భావిస్తున్న అతను తన పేరు మనోజ్ అని తప్ప మిగతా విషయాలేవీ చెప్పడం లేదు. ఆ వ్యక్తికి ఆశ్రమం కల్పించాలని సూర్యాపేటలోని అన్నపూర్ణ సేవా సమితికి సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన సేవా సమితి అధ్యక్షుడు రాజు, సభ్యుడు రాము, కొప్పోలు గ్రామానికి వచ్చి ఆ వ్యక్తిని తమ ఆశ్రమానికి తీసుకుని వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శివ ప్రసాద్, గ్రామ యువత, పోలీసు సిబ్బందిని అభినందించారు.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ కార్యాలయంలో నిద్రిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆర్టీఐఏ కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయంలో నిద్రపోతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షులు సరికొండ రుషికేశ్వర్ రాజు, చిలుముల కొండలు మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కమిషనర్ ప్రజా సమస్యలను పక్కనబెట్టి టెబుల్‌పై కాళ్లు పెట్టి నిద్రపోవడం దురదృష్టకరంగా ఉందన్నారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ ఈ విషయాన్ని సుమోటోగా తీసుకొని కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్తీక్‌రాజు, మచ్చ మధుకర్, మంద శేఖర్, గణేష్, అజయ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే వాహనాలు సీజ్

మిర్యాలగూడ అర్బన్ : వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే వాహనాలు సీజ్ చేస్తామని ట్రాఫిక్ ఎస్‌ఐ మోహన్ బాబు అన్నారు. శుక్రవారం నంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు నంబర్ ప్లేట్లు వేయించి వాహనాదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన పత్రాలను లేని వాహనాలను సీజ్ చేయడంతో పాటు చలానాలు వేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చింతపల్లి : హైదరాబాద్- నాగార్జున సాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండల పరిధిలోని వింజమూరు గేటు సమీపంలో మోటారు సైకిల్- కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన మావిళ్ల వెంకటేష్ చింతపల్లి నుంచి మాల్ వెంకటేశ్వరనగర్‌కు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా హైదరాబాద్ వైపు నుంచి మల్లేపల్లి వైపు వస్తున్న కారు.. వింజమూరు గేటు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం వెంకటేష్‌ను హైదరాబాద్ కామినేని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

లైసెన్స్ డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి

పెద్దవూర : లైసెన్సు డీలర్ల వద్దనే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలని ఇన్‌చార్జ్ ఏడీఏ పి.సందీప్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయకూడదని, నకిలీ విత్తనాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రశీదుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకాల పన్ను నంబర్, విక్రయదారుడి గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, తేదీలు, విత్తన రకం పేర్లు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్ద తూకం వేయించాలని తెలిపారు.



చింతపల్లి : కుర్మేడులో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీలక్ష్మి



పెద్దవూర : ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఏడీఏ సందీప్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

చింతపల్లి : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఏడీఏ శ్రీలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కుర్మేడు పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు లైసెన్స్ కలిగి ఉన్న విత్తన దుకాణాల వద్ద నుంచే విత్తనాలను కొనుగోలు చేసి రషీదు పొందాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఏఓ శ్రావణకుమారి, ఏఈఓ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి : పత్తి రైతులు అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనాలని మండల వ్యవసాయాధికారి సైదానాయక్ సూచించారు. మండలంలోని కుక్కడం, అభంగాపురం, చిరుమర్తి గ్రామాల్లో శుక్రవారం విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక రైతులకు ఆయన అవగాహన కల్పించారు. విత్తనాలు కొనగానే డీలర్ వద్ద రశీదు తప్పక తీసుకోవాలని, దానిపై తయారీ సంస్థ పేరు, విత్తన రకం, బ్యాచ్, లాట్ నంబర్లు, ధర, ముగింపు గడువు తేదీ సరి చూసుకోవాలి చెప్పారు. ప్యాకెట్‌పై జీఈఏసీ నంబర్ చూసుకోవాలని, అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయించే వారి వివరాలు తమకు అందజేయాలని కోరారు. బోల్‌గార్డు-2 విత్తనాల ప్యాకెట్ ధర రూ. 864 మాత్రమేనని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఓలు పార్వతి, లావణ్య, వేణుగోపాల్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మాడుగులపల్లి : కుక్కడంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సైదానాయక్

కొండమల్లేపల్లి : రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి పొందిన రశీదును పంట దిగుబడి వచ్చే వరకు భద్రపర్చుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం బోల్ గార్డ్-2 పత్తి గింజ ప్యాకెట్ ధరను రూ.864గా నిర్ణయించినట్లు తెలిపారు. రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలు కూడా స్థానిక సహకార వ్యవసాయ సంఘంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ తనిఖీలలో మన గ్రోమోర్ స్టోర్ మేనేజర్ రాజు ఉన్నారు.

పట్టభద్రులు ఆలోచించి ఓటెయ్యాలి

దేవరకొండ : ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పట్టభద్రులు, మేధావులు ఆలోచించి ఓటెయ్యాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కోరారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎన్నికల్లో రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పల్లా ప్రవీణ్‌రెడ్డి, నీలా రవి, టీవీఎన్ రెడ్డి, చింతపల్లి సుభాష్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం

మిర్యాలగూడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని మార్నింగ్ వాకర్స్‌తో, కోర్టులోని బార్ అసోసియేషన్ సభ్యులతో రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్ సాగర్, సీనియర్ నాయకుడు అన్నభీమోజు నాగార్జునచారితో కలిసి సమావేశమై మాట్లాడారు.



దేవరకొండ : రాకేష్‌రెడ్డికి ఓటు వేయాలని పట్టభద్రులను కోరుతున్న మాజీ ఎమ్మెల్యే

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వేలాద్రి, సీనియర్ న్యాయవాదులు ఎల్లయ్య, రవినాయక్, వెంకన్న, నాయకులు కరీం, పశ్యాం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, రామస్వామి, శ్రీనివాస్‌యాదవ్, దయాకర్‌రెడ్డి, తిరందాసు విష్ణు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులకు వార్డుల కేటాయింపు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలోని 48 వార్డులకు గాను 11 మందితో వార్డు ఆఫీసర్లను నియమించి వారికి వార్డులను కేటాయించినట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డు ఆఫీసర్లు విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. వార్డు ఆఫీసర్ ఎంఏ రహీమ్‌కు 8, 9, 10, 11, 12, ఎం వెంకటేశ్వర్లుకు 22, 23, 24, 25, 39, సీహెచ్ సైదులుకు 14, 33, 34, 35, 46, పి. శ్రీనివాస్‌కు 30, 42, 43, 44, 48, పి. సరితకు 6, 7, 20, 21, కె., పావనికి 15, 16, 17, 37, ఎం. సురేష్‌కు 18, 19, 36, 45, ఎన్. సంధ్యకి 26, 27, 28, 40, వై. రాధకి 13, 29, 31, 32, ఎస్. సంగీతకు 1, 2, 3, 4, 5, జె. ప్రణతికి 38, 41, 47 వార్డులను కేటాయించినట్లు తెలిపారు. ఆయా వార్డుల్లోని వార్డు ఆఫీసర్లకు ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయవచ్చన్నారు. వార్డు ప్రజలు వార్డు ఆఫీసర్లకు సహకరించాలని కోరారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



హాలియా : ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



త్రిపురారం : పూజలో పాల్గొన్న జానారెడ్డి

హాలియా : హాలియా పట్టణంలోని సాయిప్రతాప్‌నగర్ కాలనీలో కొలువై ఉన్న స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గత మూడు రోజులు నిర్వహిస్తున్న ఏకాదశి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నాటితో ముగిశాయి. ఆలయ స్థానాచార్యులు గోవర్ధన రాఘవాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం మహాపూర్ణహుతి, నవ కళశాభిషేకం, చక్రాస్నానం, సాయంత్రం శ్రీపుష్ప యాగం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మిర్యాలగూడకు చెందిన ప్రముఖ న్యాయవాది యడవెల్లి కొండల్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి రూ. 50వేలు విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నామాని సుధాకర్, రావుల వెంకటేశ్వర్లు గౌడ్, భాగ్య, సరస్వతి, చంద్రకళ, కృష్ణవేణి, రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

జానారెడ్డి పూజలు

త్రిపురారం : మండలంలోని బొర్రాయిపాలెంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల కల్యాణం గురువారం గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం గ్రామస్తుల ఆహ్వానం మేరకు మాజీ మంత్రి జానారెడ్డి ఆ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బిట్టు వసంత రవికుమార్‌తో కలసి ఆలయ పూజారులు పూర్ణకుంభంతో జానారెడ్డికి స్వాగతం పలికి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు ,భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించొద్దు

త్రిపురారం : అభివృద్ధి పనుల్లో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని డీపీఎల్‌ఓ రాఘవారావు అన్నారు. శుక్రవారం మండలంలోని అల్వాలపాడు, అంజనపల్లి, లచ్యాతండా, గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నర్సరీలు, పల్లెప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, క్రిమిటోరియంలు పరిశీలించి పాఠశాలలకు విద్యుత్ సరఫరాపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రత్యేక అధికారులతో పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో గ్రామాల్లోని ప్రజలకు అందిచాల్సిన వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నర్సరీల్లో మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీఓ కొడిరెక్క రాజేందర్, కార్యదర్శులు ఉన్నారు.



నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న డీపీఎల్‌ఓ

కబడ్డీ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

నిడమనూరు : కబడ్డీ ఉచిత శిక్షణ క్యాంపును యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ గోపాలరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కబడ్డీ ఉచిత క్యాంపును ఆయన ప్రారంభించారు. క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు ఉద్యోగాలకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ కోచ్ సయ్యద్, విశ్రాంత ప్రదానోపాధ్యాయుడు అంకయ్య, చాపల వెంకటరెడ్డి, పోలే యాదగిరి, పెద మాము రాజు, రవి, అశోక్, దాసు, శంకర్, కరుణాకర్, ఈశ్వర్, శ్రీకాంత్, భాస్కర్ పాల్గొన్నారు.

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలి



మాట్లాడుతున్న పోకల కిరణ్‌కుమార్

మిర్యాలగూడ టౌన్ : జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని మాదిగ సంఘాల మహా కూటమి రాష్ట్ర చైర్మన్ పోకల కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక రాజీవ్ భవన్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా మాదిగ సంఘాల మహాకూటమి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదిగలు, మాదిగ ఉప కులాలకు 15శాతం నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలన్నారు. ముందుగా మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్‌కుమార్‌ను సంఘాల నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో తలకొప్పుల సైదులు, రామకృష్ణ, గూడపూరి శ్రీను, పోలేపల్లి ఉదయ్‌కుమార్, జంగన్న, సైదులు, సురేష్, బొంగరాల వెంకటయ్య, మంద శ్రీను, పోకల నాగయ్య, సైదులు, వెంకన్న, రవి, శ్యాం, సైదులు తదితరులున్నారు.

గొర్రెల యూనిట్ మొత్తానికి నగదు బదిలీ చేయాలి

మాడుగులపల్లి : డీడీలు చెల్లించిన గొల్లకురుమలకు ప్రభుత్వం యూనిట్ మొత్తానికి వెంటనే నగదు బదిలీ చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సహకార సంఘం జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని కుక్కడం గ్రామంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులు చెల్లించిన డీడీలు వాపస్ చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు. నగదు వాపస్ ఇస్తే వచ్చిన మొత్తం వడ్డీకే సరిపోదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 2 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తే ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంట ముసలయ్య, కదారి శ్రీను, ఊరిబండి శంకర్, మల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న గొర్రెలకాపరులు

చింతగూడెం వాసికి డాక్టరేట్

హాలియా : అనుముల మండలంలోని చింతగూడెం గ్రామానికి చెందిన మీసాల ఉదయ్‌కుమార్ డాక్టరేట్ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు పర్యవేక్షణలో ×పెద్దింటి అశోక్ కుమార్ నవలలు సమగ్ర పరిశీలన¶ అనే అంశంపై మీసాల ఉదయ్‌కుమార్ పరిశోధన చేశారు. దీనికి ఉస్మానియావిశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించిందని తెలిపారు. 2017లో యూజీసీ నెట్ ద్వారా దేశంలోని ఉత్తమ ర్యాంకుతో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జెఆర్ఎఫ్)కు ఎన్నికై పరిశోధనను ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని హయత్‌నగర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(కళాశాల బాయ్స్) తెలుగు ఉపాధ్యాయుడిగా ఉదయ్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తన పరిశోధనకు సహకరించిన ఉస్మానియా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య రవీందర్, శాతవాహన విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య సంకుసాల మల్లేశం, మామా మల్లెల నర్సింగ్‌రావు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య గోనానాయక్, రిటైర్డ్ ఓయూ ఓఎస్‌డీ క్రిష్టారావు, ఓయూ తెలుగు ప్రొఫెసర్ ఆచార్య సూర్యధనుంజయ్, లింగప్ప, సీత లక్ష్మికి ఉదయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. చింతగూడెం గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్‌కి డాక్టరేట్ రావడం పట్ల గ్రామానికి చెందిన స్నేహితులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఉదయ్‌కుమార్

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో అంగన్‌వాడీ కేంద్రాల గురించి వివరిస్తున్న సీడీపీఓ పద్మావతి

నిడమనూరు : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం సాదాసీదాగా నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యం, సభ్యులు సరిగా హాజరు కాకపోవడంతో సమస్యలపై ప్రశ్నించే వారు లేకుండా పోయారు. అధికారులు తమ విభాగాలకు సంబంధించిన విషయాలను చదివి వినిపించారు. ఎంపీపీ బొల్లం జయమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు ఎంపీడీఓ వెంకటయ్య, సూపరింటెండెంట్ రమేష్, సీడీపీఓ పద్మావతి, ఏఓ మునికృష్ణ, డాక్టర్ మాధవ్ కుమార్, ఏఈ వెంకటేశం, మార్కెట్ కార్యదర్శి చందర్‌రావు, ఎంపీటీసీలు యాదయ్య, రాధ, రాణి, శ్రీను, లక్ష్మి, నాగేంద్ర, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు బంజారా ఉద్యోగుల మద్దతు

మిర్యాలగూడ టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు బంజారా సంఘం, బంజారా ఉద్యోగుల సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానింగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలు పట్టించుకొని అధికారులు, ప్రజా ప్రతినిధులను నిలదీసి పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అని అన్నారు.

బీసీ విద్యార్థి సంఘం మద్దతు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు బీసీ విద్యార్థి సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గాదగోని మహేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు జీడయ్య, శ్రీకాంత్, అనిల్, శేషు, నరేష్, మహేష్ తదితరులున్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

మిర్యాలగూడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎంఏ.సలీం కోరారు. శుక్రవారం ఆయన పట్టణంలోని మసీదుల వద్ద ముస్లిం , మైనార్టీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎం ఏ.ఆరిఫ్, నాయకులు గౌస్ పాల్గొన్నారు.

లాల్, నీల్ ఐక్యతతో బహుజన రాజ్యాధికారం సాధ్యం

మిర్యాలగూడ అర్బన్ : లాల్, నీల్ ఐక్యతతో బహుజన రాజ్యాధికారం సాధ్యమవుతుందని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో నిర్వహించిన ఆ పార్టీ రాష్ట్ర తరగతలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో 93శాతం ఉన్న బహుజనులు అన్ని విధాలుగా అణచివేతకు గురవుతున్నారన్నారు. పెట్టుబడిదారి దోపిడీ ఆధిపత్య వర్గాలకు వ్యతిరేకంగా ప్రజా ద్యుమాలు నిర్మించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న కూమారస్వామి, మట్టయ్య, సుధాకర్, నజీర్, మంద రవి, సైదమ్మ, చంద్రయ్య, రమేష్, నాగార్జున, కాశి, సావిత్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాదగోని రవి

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

నాగార్జునసాగర్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు కళ్యాణ్‌నాయక్, ఉప ఎన్నిక ఇన్‌చార్జ్ చలమల వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం నందికొండ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్, రంగ రాజు, రామదాసు, రామారావు, రాజు,జయమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు, సుందరయ్య పార్క్‌లో మార్నింగ్ వాకర్స్‌ను, ఇండోర్ స్టేడియం, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లోని పట్టభద్రులను ఆ పార్టీ నాయకులు కలిసి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, అసెంబ్లీ ప్రభారీ గోగిరెడ్డి లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తం రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ నాగిరెడ్డి, పట్టణ అధ్యక్షులు హన్మంత రెడ్డి, శ్యాం, శ్రీనివాస్‌రెడ్డి, రవిబాబు, వేణు, వెంకటేష్, భాస్కర్, రాజిరెడ్డి, పాల్గొన్నారు.

బడులు తెరిచేలోపు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రాము

గుర్రంపోడు : నూతన విద్యాసంవత్సరంలో పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించనున్నట్లు ఎంఈఓ తరి రాము తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏమ్మార్సీ కేంద్రంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం వినియోగించుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు సమభావన సంఘాల ద్వారా కుట్టిస్తున్న యూనిఫాంలను ఆయన పరిశీలించారు. ఏపీఎం, సమభావన సంఘాల మహిళలు చొరవ చూపిస్తున్నందున వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఏపీఎం పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ ఏది

పీఏపల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారికి ఆనుకొని ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి.. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల, గాంధీ చౌక్ వద్ద, ప్రధాన రహదారిని ఆనుకొని ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు ఎలాంటి రక్షణ లేదు. జన సంచార ప్రాంతం కావడంతో ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి రక్షణ వలయాలను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. –పెద్దఅడిశర్లపల్లి



ప్రధాన రహదారి వద్ద రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్



స్త్రీ శక్తి భవనం వద్ద ఇలా..

ప్రమాదకరంగా మూలమలుపు





ప్రమాదకరంగా ఉన్న దోనియాల ఎక్స్‌రోడ్డు వద్ద మూలమలుపు

- దోనియాల ఎక్స్‌రోడ్డు వద్ద తరచూ ప్రమాదాలు
- కానరాని సూచిక బోర్డులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పట్టణం మీదుగా జడ్చర్ల – కోదాడ 167వ జాతీయ రహదారి వెళ్తుంది. అయితే స్థానిక సాగర్ రోడ్డులోని దోనియాల ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డు మార్గం కాస్త మూలమలుపుగా ఉండడంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేగాక రోడ్డు పక్కన వాహనాలు నిలుపుతుండడం వల్ల వచ్చిపోయే వాహనాలకు ఇబ్బందికరంగా ఉంటుంది. రోడ్డు దాటడానికి జీబ్రా క్రాసింగ్ లాంటి సూచికలు లేకపోవడంతో వేగ నియంత్రణ బోర్డులు కూడా లేకపోవడం పలు ప్రమాదాలకు తావిస్తున్నాయి. జాతీయ రహదారి కావడంతో నిత్యం భారీ వాహనాలు ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి సమయంలో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. యూటర్న్ తీసుకోవడానికి రోడ్డు దాటడానికి సూచిక బోర్డులు ఉన్నట్లయితే కొంత మేర ప్రమాదాలు నివారించే అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు వేగ నియంత్రణ, మూలమలుపులు సూచించే బోర్డులను ఏర్పాటు చేస్తాం. రోడ్డు దాటే క్రమంలో, యూటర్న్ తీసుకునే వారి కోసం జీబ్రా క్రాసింగ్‌ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం.

– హరికిశోర్ ఏడబ్ల్యూఓ